ఆదివారం
ప్రజాశక్తి
డిసెంబర్ 29, 2002

హ్యాపీ బర్త్‌డే

(29-12-2002 నుండి 4-1-2003 వరకు)

కె.సంతోష్
డిసెంబర్,29
సరళ-చంద్రశేఖర్
అనంతపురం

వెన్నాలక్ష్మివెలగొండారెడ్డి
7॥సం,30. 12. 1995
రామలక్ష్మి-శ్రీనివాసరెడ్డి
పెద్దారవీడు- ప్రకాశం

ఆర్. అపర్ణ
4సం॥, 30.12.1998
సీతామహలక్ష్మి-గోవిందు
ఉండవల్లి-గుంటూరు

వి.మనోజ్ కుమార్
1సం॥, 31.12.2001
మహేశ్వరి-బాలమద్దిలేటి
ఓర్వకల్-కర్నూలు

డి.హృతిక్
1సం॥1.1.2002
లీల- డి.ఆర్.నాయక్
షమీర్‌పేట్-రంగారెడ్డి

భానుప్రశాంత్
10సం॥,1.1.1992
వసంతమ్మ-బిక్షాలు
రాణీగారితోట- విజయవాడ

అఖిల్‌తేజ్
జనవరి,1
బిజిమోల్-మాత్యూస్
పామర్రు-కృష్ణ

నందమైత్రేయి
3సం॥, 1.1.1999
ఆదిలక్ష్మి-నందగోపాల్
నందికొట్కూర్

డి.మోహన్
1సం॥3.1.2002
ఉమ-ఉపేందర్
ఎనుగల్-వరంగల్

ఈర్ల మనోజ్ఞ(మానససాయి)
జనవరి,3
జ్యోతి-మహేష్
సూర్యనగర్-విజయనగరం

తాళ్ళూరు హేమసూర్య
4సం॥, 4.1.1999
రమ-సాంబశివప్రసాద్

లంబు ప్రసన్న
9సం॥, 4. 1. 1994
పార్వతి- సుబ్బారావు
నండూరు-గుంటూరు

అబ్దుల్ సమీవుల్లా
3సం॥, 4.1.2000
రెహానా-సనావుల్లా
పామర్రు- కృష్ణ

ఎలర్జీకి చికిత్స వుందా?

డాక్టర్ పి.వి. ప్రభాకరరావు,
చెస్ట్ ఎలర్జీ, నిద్రవ్యాధుల నిపుణులు.

మనం సాధారణంగా రకరకాల ఎలర్జీల గురించి వింటుంటాము. ఉదా : డస్ట్ ఎలర్జీ, కొన్ని రకాల పువ్వుల పుప్పొడి, పెర్‌ఫ్యూమ్స్ ఇలా వివిధ రకాలు తమకు సరిపోవని చెబుతుంటారు. అసలు ఈ ఎలర్జీ అంటే ఏమిటి?

దీని ప్రభావం ఆయా వ్యక్తులపై ఎలా వుంటుంది. ఎలర్జీ అనేది దేనివలన వస్తుంది. ఎలర్జీ లక్షణాలు ఏమిటి? చికిత్స వుందా? అసలు ఎలర్జీ రాకుండా చేయగలిగే నివారణోపాయాలు ఏమన్నా వున్నాయా? ఇలాంటి అనేక ప్రశ్నలు మనను వేధిస్తుంటాయి. ఈ ఎలర్జీ గురించి తగిన వివరాలను సేకరించేందుకు ఈ చికిత్సలో తగు వైద్యసేవలను అందిస్తున్న ఛాతీ (ఊపిరితిత్తులు), ఎలర్జీ, నిద్రవ్యాధుల నిపుణులు అయిన డాక్టర్ పి.వి. ప్రభాకరరావుగారితో ఇంటర్వ్యూ.

◆ **ఎలర్జీ అంటే ఏమిటి? ఎలర్జీకి కారణాలు ఏమిటి?**

ఎలర్జీ అనగా శరీరము యొక్క ప్రతిక్రియ. ఇది వంశపారంపర్యంగా రావచ్చు. ఈ ప్రతిక్రియను కలిగించే పదార్థాలను ఎలర్జీన్స్ అని అంటారు. ఈ ఎలర్జీన్స్ శరీరంలో చేరి రసాయనిక పదార్థాలను (యాంటీబాడీస్‌ను) ఉత్పత్తి చేస్తాయి. ఈ యాంటిజన్ యాంటీబాడీ శరీరములో కలుగజేయు సమ్మిళిత రూపక్రియను ఎలర్జీ అంటారు.

ఎలర్జీన్స్ విభిన్న రకాలు : పరాగములు (పుప్పొడి రేణువులు), బూజు సంబంధిత పదార్థాలు (ఫంగస్), ధూళి, క్రిమికీటకాలు, కొన్ని రకాల ఆహార పదార్థాలు. ప్రస్తుత ప్రపంచంలో కలుషిత వాతావరణం, ధూమపానం, వాహనాల నుండి వెలువడే కలుషితమైన పొగ, కర్మాగారాల నుండి విసర్జించు పొగ, వివిధ రకాల రసాయనిక పదార్థాలు మొదలగునవి.

◆ **మానవ శరీరంలో ఎలర్జీ ఏ విధంగా ప్రతిఫలిస్తుంది? (కనబడుతుంది)?**

ఎలర్జీ ముఖ్యంగా రెండు విధాలుగా వుంటుంది. (ఎ) త్వరితగతి ప్రతి క్రియ (బి) విలంబిత ప్రతి క్రియ

యాంటిజన్ సాధారణంగా మనం పీల్చే గాలిలో వుంటుంది. వివిధ రకాల కలుషిత వాయు సమ్మేళనమైన గాలి మనం పీల్చినపుడు మన నాసికా రంధ్రముల నుండి ఊపిరితిత్తులలోకి చేరుతుంది. మొదటిసారి శరీరమునకు ఏ హానీ కలుగదు. పదే పదే శరీరం ఈ యాంటిజన్ తాకిడికి గురియైన సందర్భాలలో ఎలర్జీ వస్తుంది.

◆ **మన శరీరంలో ఏయే భాగాలు (అవయవాలు) ఎలర్జీకి గురవుతాయి?**

సాధారణంగా ముక్కు, గొంతు, శ్వాసకోశములు, చర్మంపై ఎలర్జీల ప్రభావం వుంటుంది. ఇది ఇంతకుముందు తెలిపినట్లుగా రెండు రకాలుగా జరుగుతుంది. త్వరితగతి రియాక్షన్ ఇమ్యునోగ్లోబులిన్ - ఇ అను యాంటీబాడీ నుండి వస్తుంది. రెండవరకం రియాక్షన్ సెల్యులర్ రియాక్షన్ - ఇస్నోఫిల్స్, లింఫోసైట్స్ అను రక్త కణముల ద్వారా జరుగును.

◆ **ఎలర్జీ తాకిడికి గురియైన వ్యక్తులలో ఎటువంటి లక్షణాలు వుంటాయి?**



ముక్కు నుండి నీరు కారడం, జలుబు, చెవి, ముక్కు, గొంతు, కళ్ళు దురదగా వుండవచ్చు. ఇవి కొన్ని సీజన్స్‌లో మాత్రమే వుండవచ్చును. లేదా కాలక్రమేణా సంవత్సరం పొడవునా వుండవచ్చును. మరికొంతమందిలో శ్లేష్మము, ఆయాసము వుండవచ్చు. కొంతమందిలో ఈ రెండూ లక్షణాలు కలిసి వుండవచ్చు. జలుబు, తుమ్ములు, తలనొప్పిని రైనో సైనసైటిస్ అంటారు. ఆయాసాన్ని ఉబ్బసం (ఆస్మా) అంటారు. ఈ రెండూ ఒకదానిలో ఒకటి కలిసి రావచ్చు. ఈ లక్షణాలు ఉధృతంగా వుంటే లైఫ్ సేవింగ్ డ్రగ్ ఇవ్వవలసిన అవసరం వుంటుంది.

◆ **ఎలర్జీ లాంటి ఇతర సమస్యలు (కాంప్లికేషన్స్) ఉన్నాయా?**

ఎగ్జిమా, అర్టికెరియా అనే ఇతర సమస్యలు గలవు. సర్వసాధారణంగా చిన్న ప్రాయమున ఎగ్జిమా వుండి యవ్వన, కౌమార దశల యందు ఎలర్జిక్ రైనటిస్ లేదా ఆస్తమాగా మారును.

రోగ నిర్ధారణ ఏ విధంగా చేస్తారు?

మొదట రోగ లక్షణాలు తెలుసుకోవాలి. వీటిలో ముఖ్యమైనవి ఫ్యామిలీ హిస్టరీ, రెండవది వారు నివసించే వాతావరణం, పరిసరాల ప్రభావం, ఇన్‌ఫెక్షన్, వృత్తి, అలవాట్లు మొదలగు విషదీలిల అవసరం.

ఇక ఎలర్జీ టెస్టింగ్ : బ్లడ్ టి.సి., డి.సి., ఛాతీ ఎక్స్‌రే, రివర్సిబుల్ ఎయిర్ బేస్ టెస్ట్, సైనస్‌ల ఎక్స్‌రేలు కూడా ఎలర్జీ నిర్ధారణకు ఉపయోగపడతాయి. ఎలర్జీ వున్న వ్యక్తి లక్షణాలు బట్టి ఆ వ్యక్తికి ఇవ్వవలసిన యాంటిజన్స్‌ను ఎన్నుకోవడం జరుగుతుంది. ఈ యాంటిజన్స్ పుప్పొడి, ధూళి, వివిధ రకాల క్రిమికీటకాదులను చర్మం పై పొరలలో ఇన్‌జక్షన్ (ప్రిక్ టెస్ట్) చేసి నిర్ధారిస్తారు. 20 లేక 30 నిమిషములలో ఎలర్జీ ఉన్నచో దద్దురు వస్తుంది. ఇది టైప్-1 రియాక్షన్. కొంతమందికి డిలేయిడ్ రియాక్షన్ 6 గంటల తరువాత వస్తుంది. ఇది టైప్-2 రియాక్షన్. ఈ పరీక్ష ద్వారా ఏ పదార్థములకు ఎలర్జీ ఉన్నది తెలుస్తుంది.

◆ **ఎలర్జీ నిర్ధారణ అయిన తరువాత దానికి ఎటువంటి చికిత్స చేస్తారు?**

ఎలర్జిక్ రియాక్షన్, రోగి లక్షణములు చూసి దానికి తగిన ఇమ్యూనోథెరపీ చేయవలసి వుంటుంది. ఈ ఇమ్యూనోథెరపీ ఒక సంవత్సరం నుండి 5 సంవత్సరముల వరకు చేయవలసి రావచ్చు. కొంతమందిలో జీవితకాలం అవసరం అవుతుంది. ఈ ఇమ్యూనో థెరపీలో ఎలర్జీ వ్యాక్సిన్ గ్రేడెడ్ డోసులలో నిర్ణీత కాల వ్యవధిలో చర్మం దిగువ (Intradermal) ఇంజక్షన్ చేస్తారు. దీని ద్వారా కొంతమందిలో ఎలర్జీ ఉద్రిక్తత చాలావరకు తగ్గుతుంది. కొంతమందిలో పూర్తిగా నయమవుతుంది. కొంతమందికి ఎలాంటి ఉపయోగం లేకపోవచ్చును.

◆ **"ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దాన్ డిసీజ్" వ్యాధి వచ్చిన తరువాత చికిత్స కంటే వ్యాధి రాకుండా జాగ్రత్త అవసరం అని చెప్పినట్లు అసలు ఈ ఎలర్జీ రాకుండా తీసుకొనవలసిన జాగ్రత్తలు, నివారణోపాయాల గురించి తెలియజేస్తారా?**

కొన్ని ఆహార పదార్థాలు తీసుకొన్నప్పుడు ఎలర్జీ లక్షణాలు కనిపిస్తే అవి తీసుకోకుండా ఉండటం ఉత్తమం. అలాగే పెంపుడు జంతువుల (కుక్క, పిల్లి) వలన ఎలర్జీ వస్తే వాటికి దూరంగా వుండటం మంచిది.

★ నిద్రించే గది పరిశుభ్రంగా వుంచుకోవాలి.

★ తివాచీ మరియు ఫ్లోర్ కవరింగ్స్ వాడరాదు.

★ బెడ్‌రూమ్‌లో న్యూస్ పేపర్స్, పుస్తకములు, వంట సరంజామా, ధూళికి సంబంధించిన వస్తు సామగ్రి వుంచకూడదు. ఎలర్జీకి కారణభూతమైన క్రిమి సర్వ సాధారణంగా పరుపులు, దిళ్ళలో వుంటాయి కనుక ఇవి పరిశుభ్రంగా వుంచవలెను. చాపలు, కుషన్‌బెడ్స్, సోఫాలు ఇవి ఎప్పటికప్పుడు శుభ్రంగా వుంచడం వలన ఎలర్జీ తాకిడి నివారించవచ్చును. ★

ధ్వన్యనుకరణ సమ్రాట్ వేణుమాధవ్

అంపశయ్య నవీన్

"మీతో కాస్సేపు మాట్లాడదామని ఇలా వచ్చాను. మీరెటో వెళ్ళే తొందర్లో ఉన్నట్టున్నారు" అంటూ వచ్చాడు మిత్రుడు సాంబశివరావు.

"వెళ్ళే తొందర్లోనే ఉన్నాను. కానీ నీకోసం కొంచెం సేపు ఆగుతాను.... చాలా కాలానికి కలిశావు కదా...." అన్నాను అతన్ని ఇంట్లోకి ఆహ్వానిస్తూ.

"మీరెక్కడికెళ్తున్నారో చెప్పనేలేదు" అన్నాడు సాంబశివరావు మా డ్రాయింగ్ రూంలోకి ప్రవేశించి సోఫాలో కూర్చుంటూ.

"డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్‌పేరు వినే ఉంటావు. ఈ డిసెంబర్ 28న ఆయన సప్తతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆ ఉత్సవాల నిర్వహణ కమిటీలో నేను కూడా ఓ మెంబర్ని. దాదాపు నాల్గు దశాబ్దాలుగా నాకాయనతో స్నేహం ఉంది" అన్నాను.

"వేణుమాధవ్ పేరు వినకపోవడమేమిటి? ఆయన మన వరంగల్.వాడే కదా... ఆయన నందరూ విశ్వవిఖ్యాత ధ్వన్యనుకరణ సమ్రాట్ అంటుంటారు. ఆయనకీమధ్యనే అంటే రెండేళ్ళ క్రితమే కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ బిరుదు ప్రదానం చేసింది కూడా. అయితే నాకో సందేహం. కుక్కల్నీ, నక్కల్నీ అనుకరించడం వల్ల పెద్ద సామాజిక ప్రయోజనమేమన్నా ఉందంటారా?" అన్నాడు సాంబశివరావు.

"మొదట్లో నీలాంటి సందేహమే నాకూ కల్గుతుండేది. కానీ రెండుమూడు సార్లు వేణుమాధవ్ గారి మిమిక్రీ ప్రదర్శన చూశాక నా అభిప్రాయం పూర్తిగా మారింది. అనుకరణ కూడా గొప్పకళే... ఆశ్చర్యమేమిటంటే అనుకరణ కూడా ఒక కళేనని మన పూర్వులెప్పుడో గుర్తించారు. మనవాళ్ళు కళల్ని చతుష్షష్టి కళలుగా అంటే 64 కళలుగా విభజించి అందులో 'స్వరవంచన' అంటే స్వరాల్ని అనుకరించడాన్ని కూడా చేర్చారు. అనుకరించడం అనేది మానవుడికి అత్యంత సహజంగా అలవడుతుంది. పసిపిల్లలు వాళ్ళ తల్లిదండ్రుల్ని అనుకరించడం ద్వారానే అనేక విషయాలు నేర్చుకుంటారు. విద్యార్థులు వాళ్ళకు చదువుచెప్పే ఉపాధ్యాయుల్ని అనుకరిస్తారు. అయితే ఎవరైనా ఒకర్ని కావాలని అనుకరించినప్పుడు అది వెంటనే హాస్యాన్ని సృష్టిస్తుంది. అందువల్ల అనుకరణ కళవల్ల ఒనగూడే సామాజిక ప్రయోజనమేమిటంటే ప్రజల్ని కాసేపు తమ కష్టాల్నీ, చీకాకుల్నీ మరచిపోయి హాయిగా నవ్వేటట్టు చెయ్యడం. డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ గొప్పతనమేమిటంటే దాదాపు ఓ అర్ధ శతాబ్దం నుంచి ఆయన ఈ కళలో కృషిచేసి ఆ కళకు ప్రపంచ వ్యాప్తంగా గొప్ప గుర్తింపు తీసుకొచ్చాడు. ఆయన చాలా చిన్నప్పట్నించే హైస్కూల్లో చదువుకుంటున్నప్పుడే మిమిక్రీ కళను ప్రదర్శించడం ప్రారంభించాడు. 1947లో ఆయన వరంగల్‌లోని ఎ.వి.వి. హైస్కూల్‌లో చదువుకుంటున్న రోజుల్లో స్కూలుడే సందర్భంగా ఆయన తన మొట్టమొదటి మిమిక్రీ ప్రదర్శన నిచ్చాడు. ఆ మొదటి ప్రదర్శనలోనే ఆయనకు ప్రేక్షకుల నుండి చాలా గొప్ప స్పందన లభించింది. అప్పట్నుంచి ఆయన మళ్ళీ వెనక్కి తిరిగి చూడలేదు. హైస్కూలు తర్వాత ఆయన వరంగల్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో చేరినప్పుడు అప్పటి ఆ కాలేజి ప్రిన్సిపాల్ రామనర్సుగారు వేణుమాధవ్ మిమిక్రీ ప్రదర్శన చూసి నువ్వు సమీప భవిష్యత్‌లోనే అంతర్జాతీయ కళాకారుడిగా గుర్తింపు పొందుతావని దీవించాట. వేణుమాధవ్ ఆయన దీవెనని నిజం చేశాడు. ఆయనలోని కళాకారున్ని ఒక్క భారతదేశంలోనే కాదు ప్రపంచమంతా గుర్తించింది. వేణుమాధవ్ ఎక్కడుంటే అక్కడ నవ్వుల జడివాన కురుస్తుంటుంది. ఆయన ఇప్పటి వరకు పదివేలకు పైగా మిమిక్రీ ప్రదర్శనలిచ్చాడు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, ఫిజి, బెహ్రైన్, సౌతాఫ్రికా, జర్మనీ, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ మొదలైన దేశాలన్నీ మూడుసార్లు తిరిగి మిమిక్రీ ప్రదర్శనలిచ్చాడు. 1971 అక్టోబర్‌లో ఐక్యరాజ్యసమితిలో తొలి మిమిక్రీ ప్రదర్శన ఇచ్చిన ఘనత నేరెళ్ళ వేణుమాధవ్‌కు దక్కింది. ఆయన మిమిక్రీ ప్రదర్శనలు విరివిగా ఇస్తున్న రోజుల్లో ఆయనొక్కడే మిమిక్రీ కళాకారుడు. ఇప్పుడు ఆయనతో స్ఫూర్తి పొంది, మిమిక్రీ కళను అభ్యసిస్తున్న కళాకారులెంతో మంది వున్నారు. మరొక గొప్ప విషయమేమిటంటే మిమిక్రీని కేవలం ప్రదర్శించడమే కాకుండా ఆకళకొక సైద్ధాంతిక భూమికను కూడా వేణుమాధవ్ కల్పించాడు. మిమిక్రీ కళకొక గ్రామర్‌నూ, సిలబస్‌ను ఆయన రూపొందించి ఆ కళను అభ్యసించే వారికి ఎన్నో మార్గదర్శక సూత్రాలను సమకూర్చాడు. ఆయన కృషి కారణంగానే ఇవ్వాళ్ళ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మిమిక్రీ కళనొక డిప్లొమా కోర్సుగా ప్రవేశపెట్టారు. ఇవ్వాళ్ళ ఎంతో మంది యువ మిమిక్రీ కళాకారులకు ఈ డిప్లొమా కోర్సు ఎంతో ప్రయోజనకరంగా ఉంటున్నది. ప్రపంచ వ్యాప్తంగా వేణుమాధవ్‌కు 72 మంది శిష్యులున్నారట. ఆయనకు తెలియకుండా ఆయన్ను గురువుగా భావించి మిమిక్రీ కళనభ్యసిస్తున్న ఏకలవ్య శిష్యులు కూడా ఆయన కెంతోమందున్నారు. ఆయనిచ్చే మిమిక్రీ ప్రదర్శనల్లో టెన్‌కమాండ్‌మెంట్స్, బెన్‌హర్, మెకెన్నాస్‌గోల్డ్ లాంటి గొప్ప ఇంగ్లీషు సినిమాల్లోని సౌండ్స్‌ని అనుకరించడం, "ఒథెల్లో" "హామ్లెట్" లాంటి షేక్స్పియర్ నాటకాల్లోని వివిధ పాత్రల సంభాషణల్ని చెప్పడం, చిత్తూరు నాగయ్య, భానుమతి, ఎన్‌టి రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య మొదలైన తెలుగు నటీనటుల స్వరాల్ని అనుకరించడం, పృథ్వీరాజ్‌కపూర్, దిలీప్‌కుమార్, బలరాజ్‌సహానీ, హరీంద్రనాథ్ చటోపాధ్యాయ లాంటి హిందీ నటుల్ని అనుకరించడం మొదలైన ఐటమ్స్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకర్షిస్తాయి. ఇలా కంఠాన్ని అనుకరించడమే కాకుండా ఆయన చెప్పే కొన్ని జోక్స్ ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తుతాయి. ఆయన మిమిక్రీ ప్రదర్శనల్ని ఒక్కసారి చూస్తేచాలు, ఆయన మనకు జీవితాంతం గుర్తుండిపోతాడు' అన్నాన్నేను. ★

...బ్బో... ఎన్ని త్రికోణాలో!



నేస్తాలూ...

పైన బోలెడన్ని త్రికోణాలు కనిపిస్తున్నాయి కదూ. వాటిపైన ...న్నాడే - వాడి పేరు తికమక. అసలే తికమక. ఆ తికమకకు ...ప్పారు ఓ చిక్కు ప్రశ్న వేశారు. అదేంటంటే 'అరే తికమకా! ... ఎన్ని త్రికోణాలున్నాయో లెక్కించి చెప్పు. తప్పు చెప్పావో నీ ... పెడతాను' అన్నారు. దాంతో వాడు పదే పదే లెక్కిస్తున్నాడు. ... తెలట్లా. మరి మీరైనా ఎన్ని త్రికోణాలున్నాయో లెక్క పెట్టి ... గండం నుంచి తప్పిస్తారా!

...కలం స్నేహం

...రపాల ప్రశాంతి,
... 10 సం॥
...4 వ తరగతి
... టీవీ చూడడం, ఆటలు ఆడడం,
... చదువు నేర్పించడం.
...నామా : డాటరాఫ్ మురపాల శ్రీనివాసరావు,
... 1-3-70/73, కవాడిగూడ, హైదరాబాదు.

... నాగరాజు,
...:14 సం॥
...: 9వ తరగతి,
... పుస్తకాలు చదవడం, టీవీ చూడడం,
... వేయడం,
...రునామా :
... ఎం .మారయ్య, ఎస్.సి.హాస్టల్
... . నార్కట్ పల్లి, నల్లగొండ.

నైపుణ్యం

నసీరుద్దీన్ మంచి విలుకాడని ఊళ్లో చెప్పుకునేవారు. ఆమాట అలా అలా పాదుషాగారి చెవిన పడింది. అదేంటో చూద్దామన్న కతూహలం కలిగింది ఆయనకి. వెంటనే నసీరుద్దీన్‌ని పిలిపించాడు. తనతో కలిసి వేటకి వెళదాం రమ్మన్నాడు. ఇద్దరూ వెళుతుండగా ఓ చెట్టు కనిపించింది. ఆ చెట్టుకి గురి చూసి కొట్టమన్నాడు పాదుషా. నసీరుద్దీన్ కొట్టాడు. మొదటి దెబ్బకు తగలలేదు. పాదుషా నవ్వాడు. అప్పుడు 'నవ్వకండి ప్రభూ. ఇది మీ నైపుణ్యం' అన్నాడు నసీరుద్దీన్. రెండో బాణం వెయ్యమన్నాడు పాదుషా. అదీ తగలలేదు. దాంతో నసీరుద్దీన్ వైపు చూసి మళ్లీ నవ్వాడు పాదుషా. 'ఇది తమ మంత్రుల నైపుణ్యం' అన్నాడు నసీరుద్దీన్. మూడో బాణం వేశాడు నసీరుద్దీన్. అది నేరుగా చెట్టుకి తగిలింది. అప్పుడు నసీరుద్దీన్ పాదుషావైపు తిరిగి వంగి సలామ్ చేస్తూ 'ఇది నసీరుద్దీన్ నైపుణ్యం హుజూర్' అన్నాడు.

పంజరంలో చిలుక!

హలో...

గతవారం చెప్పిన మేజిక్‌ని మీ స్నేహితుల ముందు ప్రదర్శించారా! ఏమన్నారు? మీకు ఈ వారం కూడా ఒక మేజిక్ నేర్పిస్తాను. అదేంటంటే.... కింద ఒక చిలుక, పంజరం కనిపిస్తున్నాయా. ఇవి రెండూ ఎలా వున్నాయి? పక్క పక్కన వున్నాయి కదూ. కాని నే చెప్పినట్లు చేస్తే చిలుక పంజరంలో నిలబడినట్లు కనిపిస్తుంది. మీ ముక్కుని చిలుకకి, పంజరానికి మధ్య వున్న గీత మీద పెట్టి చూడండి! చిలుక పంజరంలో వున్నట్లు కనిపిస్తుంది. ఇదే ఈ వారం మేజిక్. మరి బాలనేస్తాలు పేజీ అంతా చదివి మీకు ఇష్టమైన శీర్షికలో పాల్గొంటారా!



హలో... హల్లో... పాడిగేదె... హమ్మ!



రుక్మిణి

"హలో.... హలో... పంకజం... నువ్వేనా.. నేను డాక్రా లక్ష్మిని...."

"ఆఁఆఁ... హలో... హలో...డాక్రా పంకజాన్నే... అంతా బాగేనా.. ఏందో ఇపుడే అంట్లు ముందేసుకుని కూర్చున్నా.. నీ పనయిపోయిందా... హలో...!"

"ఆఁ.. ఇంకా మొదలు కాలే... ఇపుడేనమ్మా నిదర లేచిందీ... రాత్రంతా దోవలే దోవలు... వామ్మో... ఈ ఇంకుడు మురిగ్గుంటలు సుబ్బరం చేయడానికెవడో కంట్రాక్టు పట్టిండట... వాడి చేతులు పడ... వాడు నాశనంగాను... అసలీ బజార్ని వాడు పట్టించుకోడవే లేదు..."

"సంబడం-ఫ్యానేసుకుని పండుకుంటె పాయె! దోమలు రావుగద!"

"హబ్బో... అయ్యో... గదే... ఈ కరంటోళ్ళ చేతులు పడ... మొన్నటికి మొన్న గప్‌చిప్‌గ దొంగల తీరుగ వచ్చి కరంటు కత్తిరిచ్చి పారేసింద్రుగద... వాళ్ళ పీనుగెల్ల.. చేతులిరగ....

"ఎందుకటా?"

"రోగం-ఏందో ఆ చార్జీ సర్చార్జీ... ఇందనాలమోతా అని లెక్కలు గట్టి బిల్లు పంపిస్తే కట్టడానికి పైసలు లేకపాయె!వాళ్ళేమో తడాల్న వైర్లు పీకి పారేసిరి! ఇగ ఇటు దోమల గోలకు పోరగాండ్లు.. అబ్బో... గోల...!"

"అదంతా ప్రైవేటు వాడు చేస్తున్న దుర్మార్గం... గవర్నమెంటు మంచిగ సుబ్బరమైన కరంటు చవగ్గ అందరికీ అందజేయమని అమ్మితే వాడు మొదటికే మోసం చేస్తుండు - మనం చెంద్రబాబుగారితో ఫోన్లో మాట్లాడి వాడిరోగం కుదర్చాలె... బద్మాష్.. మనం డాక్రా మహిళ్లం తలుచుకుంటే ఈ కరంటును సరి చేసుకోవచ్చు.. వామ్మో... మా ఆయన లేచిండు.. వుంటా"!

* * *

"హలో... హలో... నేనే వనజను... రాధా... నువ్వేనా... హలో"! "డాక్రారాధనే.. వనజక్కా... అబ్బ... జర చిన్నగ మాట్లాడు... మా ఆయన మొకం కడుక్కోనుపోయిండు... వామ్మో... పక్కటెముకలన్ని నొప్పి.. అబ్బా...!"

"ఏమైంది రాధా.. అరె.. ఆ ఏడుపేందే?"

"రాత్రి... సరే.. మా ఇంటిముందట్నే కొత్త బ్రాంది షాపులు నాలుగైదు ఒక్కసారె వెలిసె! మా ఆయన అదేపనిగ వాటిలజొరబడడు... అంతే - వారం నుండి ఒకటే తాగుడు... బ్రాంది దుకాణంవోళ్ళు నాశనం గాను - సంసారాల ఇండ్ల మద్యన దుకాణాలు తెచ్చి పెట్టింద్రు - వామ్మో.. లంచాలిచ్చి లైసెన్సులు పుట్టిచ్చింద్రట! వామ్మో.... ఆయనొస్తండు.. మళ్ళా తన్నుడు సురూ చేస్తడు... వుంటా...!"

* * *

"హలో... హలో పంకజం.. నేనమ్మా డాక్రా వనజను.. వామ్మో వామ్మో మన రాధను రాత్రంతా దాని మొగుడు తాగొచ్చి ఒకటే తన్నుడు. వామ్మో... వామ్మో.."

"ఏం రోగంవుట్టిందటా? తిన్నది అరగలేదటనా...ఆఁ"!

"హలో... హలో... వామ్మో.. అరగడానికి తిండెక్కడిదీ? వామ్మో... ఏదో దినసరి పనిగద... పన్లేదంటే బ్రాందిషాపుల అప్పులు బెట్టి తాగుడు..."

"అవునవును-మన ఎక్సయిజు ఆదాయం పెరగాలి గదా.. దాంతోని గాని స్వర్ణాంధ్ర వస్తదాయె.. ఆదాయం...

"ఎక్సయిజు సంగతులేమోగానీ మన రాధ ఎక్సర్‌సైజు చేస్తుంది - ఆయన గారికి నెల్లో అయిదారు రోజులు కూడా పన్లేక తాగుడికి బాగ తెగబడిపాయె! చెంబూ తపేళాలకు చలనం... మంగళసూత్రం మాయం! అద్సరెగాని అక్కా ఇంతవరకు అంట్లు తోమలేదు - సుక్కనీళ్ళు లేవు - వారానికొకసారి మాయదారి పంపులు... రెండు బిందెలు అర్జంటుగా పంపితె అంట్లు తోముకుంట..."

"హలో... హలో... 'జలయజ్ఞం' అన్నీ నీళ్ళేనని బాబుగారు చెబుతంద్రు... మా ఇంట్లె ఒక్కటంటె ఒక్క బిందుంటే మా ఆయన బుడబుడ మీద గుమ్మరిచ్చుకుని స్తానం కానిచ్చిండు. యాడికి పోవాల్నో తోచడం లేదు... హలో...."

* * *

"హలో... లక్ష్మి... రాధను.. అబ్బా.. ఒళ్ళంతా పుండు.. కాలుతీసి కాలు పెట్టలేను.. అంగో మళ్ళా తాగి... అరె... నిండు సీసా చేతుల పట్టుకునే వస్తున్నాడు గదా... ఏంచేతును... హలో...."

"హలో... రాధా... మగాడు తాగకపోతే మరెవరు తాగుతారు - ఏదో మన రాష్ట్ర ఆదాయం పెంచుకోవాల్నంటే తలో చంచా పుచ్చుకుంటే గానీ కుదరదాయె.. టార్గెట్లు గద... హలో..."

"ఆదాయం.. ఏం చేయాలె? టోపీలు తగిలించుకుని ప్రతి మంత్రి మీటింగుకీ పదీ.. పరకా అందుకుని వురుకుడాయె! గ్యాసు బండలు కొందరికిస్తే వాటిని అమ్ముకుని ఏదో వేడ్నీళ్ళకు చన్నీళ్ళు... హలో"

"హలో... మన మండలం డాక్రా మహిళలకు ఈ సెల్‌ఫోన్లివ్వడం మంచిదయింది. అందరం ఇట్లా వెంట వెంటనే సమాచారాలు తెలుసుకునే అద్భుతం.."

"ఏదో 'ఆదాయమార్గం' అంటివి.. మీటింగంటివి... లక్ష్మి..."

"హలో... ఇవాళ సాయంత్రం మనందరికీ తలా ఒక గేదెను పంచుతంద్రు... పాలు.. క్షీర విప్లవం.. ఇవాళే మంత్రిగారందజేస్తారు... వర్ధిల్లాలి.. జై స్వర్ణాంధ్ర, జై స్వర్ణాంధ్ర"

* * *

పంకజం.. రాధ... లక్ష్మి... వనజ బిలబిలమని ఇళ్ళలో నుండి రావిచెట్టు క్రిందికి టంచన్‌గా వచ్చి చేరారు. అబ్బో... వాళ్ళ ఇళ్ళన్నీ ఒకే వాడలో.. ఒకరింటి పక్కనే ఒకరివాయె! కొందరికి గోడలడ్డం. మరికొందరికి కంచె అడ్డం! గట్టిగా మాట్లాడుకుంటే చెవి పగిలిపోయేటంత దగ్గరే... సెల్‌ఫోన్లున్నాయి కాబట్టి సరిపోయింది-

"మహిళా మణులారా... మీరే మా ఆదర్శం... ప్రాణాలివ్వడానికి సిద్ధంగా వున్నాం... మీ ఆదాయం పెరిగితే మీరు స్వేచ్ఛగా ఎన్నికల్లో తిరిగి ప్రచారం చేయడానికి కావల్సినంత సమయం... అధికార్లను ఫోన్లలో నిలదీయండి... మీ అందరికీ ఆస్ట్రేలియా నుండి మేలురకం 'గేదెలు' వచ్చిపడ్డాయి..."మహిళల చప్పట్లు!

"అదుగో లారీలు... వచ్చె... అదుగో గేదెలు.. వచ్చె... క్షీర విప్లవం... బాబుగారికీజై"

అంతా కోలహలంగా మారిపోయింది - మహిళలు ఆనందంతో సెల్‌ఫోన్లు నొక్కి పక్కనున్న వారితో మాట్లాడుతూ తమ ఆనందాన్ని తెలుపుకుంటున్నారు - సమాచార విప్లవంతో అక్కడంతా 'హలో.. హలో'లతో దద్దరిల్లిపోయింది - అప్పటికే లారీలు వచ్చి ఆగడంతో అందరూ ఆనందంతో గంతులేస్తున్నారు!

"ఓరి జక్కులోడా.... ఎక్కడో ఏదో గోల్‌మాల్ జరిగిందిరా.. యాభై లారీల్నిండా వచ్చినాయి గదా...ఒరే... అవన్నీ బర్రెలు కావురా తండ్రీ.. దున్నపోతులురా నాయనా...

ఈ 'హలో... హలో' సందట్ల మహిళలు యాద్గిరి మాటల్ని అస్సలు పట్టించుకోవడం లేదాయె! ★

ఇది పురోగమనమా? తిరోగమనమా?

వై.ఎ.ఆర్.కె.ప్రసాద్

ఇటీవల ముగిసిన 32వ జాతీయక్రీడల పతకాల పట్టికలో పాత కథే పునరావృతమైంది. ప్రతి నేషనల్‌గేమ్స్‌లోనూ దాదాపుగా ఆతిథ్యమిచ్చే రాష్ట్రమే పతకాల పట్టికలో అగ్ర స్థానం సాధించడం ఆనవాయితీగా వస్తోంది. గత అయిదు నేషనల్ గేమ్స్ ఫలితాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. ఇదే ఆనవాయితీ మనకూ వర్తించిందని చెప్పొచ్చు. ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం సాధించింది. గతంలో జరిగిన ఏ జాతీయక్రీడల్లోనూ తొలి పదిస్థానాల్లో ఏ ఒక్క స్థానమూ దక్కించుకోలేని ఆంధ్ర ఒక్కసారిగా 32వ నేషనల్‌గేమ్స్ పతకాల పట్టికలో ఏ ఇతర రాష్ట్రానికీ అందనంత ఎత్తులో ఉందంటే ఆలోచించాల్సిన విషయమే. ఇప్పుడే కాదు ఏ నేషనల్‌గేమ్స్‌లోనైనా ఆతిథ్యమిచ్చే రాష్ట్రానికి ఇదే పరిస్థితి. గత అయిదు నేషనల్‌గేమ్స్‌లో మణిపూర్‌లో జరిగిన జాతీయ క్రీడల్లోనే దీనికి వ్యతిరేకంగా జరిగింది.



రాష్ట్రానికి అత్యధిక పతకాలు అందించిన ఢిల్లీ అథ్లెట్ రిచామిశ్రా

1987లో జరిగిన కేరళ నేషనల్ గేమ్స్‌లో కేరళ మొత్తం 69 పతకాలతో ప్రథమ స్థానం సాధించింది. వీటిలో 29 స్వర్ణాలు, 21 రజతాలు, 19 కాంస్యాలు ఉన్నాయి. మహారాష్ట్ర రెండో స్థానం, బెంగాల్ మూడో స్థానం సాధించాయి. ఆంధ్ర 5 స్వర్ణాలు, 12 రజతాలు, 11 కాంస్యాలతో పన్నెండో స్థానం దక్కించుకుంది. 1994 జాతీయక్రీడలకు మహారాష్ట్ర ఆతిథ్యమిచ్చింది. ఆ జాతీయక్రీడల్లో మహారాష్ట్ర 43 స్వర్ణాలు, 44 రజతాలు, 51 కాంస్యాలు, మొత్తం 138 పతకాలతో అగ్రస్థానం సాధించింది. ఢిల్లీ, తమిళనాడు వరుసగా రెండు, మూడు స్థానాలు సాధించాయి. 4 స్వర్ణాలు, 6 రజతాలు, 6 కాంస్యాలు మొత్తం 16 పతకాలతో ఆంధ్ర 17వ స్థానంలో నిలిచింది. 1997లో 29వ జాతీయక్రీడలు కర్ణాటకలో జరిగాయి. ఈ నేషనల్‌గేమ్స్‌లో కర్ణాటక 72 స్వర్ణాలు, 45 రజతాలు, 51 కాంస్యాలు, మొత్తం 168 పతకాలతో ప్రథమస్థానం ఆక్రమించుకుంది. అంతకు ముందు కేరళలో ఎనిమిదో స్థానం, మహారాష్ట్రలో నాలుగో స్థానంలో నిలిచింది. తమ రాష్ట్రానికి వచ్చేసరికి కర్ణాటక అగ్రస్థానానికి ఎగబాకింది. 1999లో మణిపూర్‌లో జరిగిన 30వ జాతీయక్రీడల ఫలితాలు మాత్రం వ్యతిరేకంగా వచ్చాయి. అయితే మణిపూర్ ప్రథమ స్థానం దక్కించుకోలేకపోయినా, రెండో స్థానం సాధించగలిగింది. మణిపూర్ అంతకు ముందు మొదటి పదిస్థానాల్లో స్థానం లేకపోయినా మహారాష్ట్రలో, కర్ణాటకలో జరిగిన జాతీయక్రీడల్లో తొమ్మిదో స్థానం సాధించింది. ఆతిథ్యమిచ్చే రాష్ట్రంగా ఒక్కసారిగా రెండో స్థానం ఆక్రమించేసింది. 49 స్వర్ణాలు, 24 రజతాలు, 39 కాంస్యాలు, మొత్తం 112 పతకాలు సాధించింది. కేరళ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జాతీయక్రీడల్లో ఆంధ్ర 9 స్వర్ణాలు, 6 రజతాలు, 11 కాంస్యాలతో 13వ స్థానంలో నిలిచింది. 31వ జాతీయక్రీడలు-2001లో పంజాబ్‌లో జరిగాయి. ఈసారి కూడా ఆతిథ్యమిచ్చిన పంజాబ్ పతకాల పట్టికలో ప్రథమస్థానం సాధించింది. 61 స్వర్ణాలు, 44 రజతాలు, 58 కాంస్యాలు, మొత్తం 163 పతకాలు సాధించింది. సర్వీసెస్, మణిపూర్ జట్లు రెండు, మూడో స్థానం దక్కించుకున్నాయి. ఆంధ్ర 11 స్వర్ణాలు, 17 రజతాలు, 29 కాంస్యాలు మొత్తం 57 పతకాలతో 12వ స్థానంలో నిలిచింది. గతంలో ఆంధ్ర క్రీడాకారులకు వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, బ్యాడ్మింటన్‌లలో ఎక్కువ పతకాలు వచ్చేవి. వీటితోపాటు స్విమ్మింగ్, వాటర్‌స్పోర్ట్స్, టేబుల్‌టెన్నిస్ అంశాల్లో కూడా అప్పుడప్పుడు పతకాలు వచ్చేవి. అథ్లెటిక్స్‌లో 1985లో ఒక స్వర్ణం వచ్చింది. గత ఏడాది పంజాబ్ నేషనల్‌గేమ్స్‌లో మళ్ళీ స్వర్ణం లభించింది. అలాగే తైక్వాండోలో 1985లో రెండు స్వర్ణాలు లభించాయి. తరువాత జాతీయక్రీడల్లో ప్రిలిమ్స్ దశ కూడా దాటలేకపోయారు. సైక్లింగ్‌లో కూడా పతకాలు కనుమరుగైపోయాయి. పూనే, కర్ణాటక, మణిపూర్ జాతీయక్రీడల్లో వరుసగా స్వర్ణాలు సాధించిన రాష్ట్ర వాలీబాల్ జట్టు పంజాబ్ నేషనల్‌గేమ్స్‌లో లీగ్‌దశకూడా దాటలేకపోయింది.

గత నేషనల్‌గేమ్స్ వరకూ వెనకబడి ఉన్న రాష్ట్రం ఒక్క సారిగా పతకాల పట్టికలో అగ్రస్థానం సాధించడం రాష్ట్ర క్రీడాకారుల ప్రతిభే అనుకుంటే పొరబాటే. ఆతిథ్యమిచ్చే రాష్ట్రంగా పరువు దక్కించుకోవాలనే ఉద్దేశంతో పొరుగు రాష్ట్రాల నుంచి క్రీడాకారులను ఎరువు తెచ్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నజరానాలకు ఆశపడిన ఇతర రాష్ట్రాల క్రీడాకారులు మన రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించారు. స్వర్ణానికి మూడు లక్షలు, రజతానికి రెండు లక్షలు, కాంస్యానికి లక్ష రూపాయల నజరానా ప్రభుత్వం ప్రకటించింది. పతకాలు ఖాయంగా వస్తాయనుకున్న క్రీడాకారులకు మరింత ఎక్కువ సొమ్ము ఆశచూపించి మరీ రాష్ట్రానికి దిగుమతి చేసుకున్నారు. ఇలా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పతకాలు సాధించి అపహాస్యం పాలుకాకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఎత్తుగడ వేసింది. ఎత్తుగడ ఫలించి 32వ జాతీయక్రీడల్లో రాష్ట్రం పతకాల పట్టికలో అగ్రస్థానం సాధించింది. రాష్ట్రం దక్కించుకున్న పసిడి పతకాల్లో తొంభై శాతం వరకు ఇతర రాష్ట్రాల క్రీడాకారులు సాధించిపెట్టినవే. దొడ్డిదారిన సాధించిన పతకాలతో ప్రథమస్థానం దక్కించుకున్నా, ఇదంతా మా ప్రతిభే అని చెప్పుకోదగ్గ ధైర్యం ఎవరికైనా ఉందా అనేది ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం. ఇంతకు ముందు జరిగిన జాతీయక్రీడల్లో ఆతిథ్యమిచ్చిన రాష్ట్రాలు ప్రథమస్థానం సాధించడానికి ఇదే పద్ధతి అనుసరించాయా లేదా అనే విషయం పక్కన బెడితే, మన రాష్ట్రం మాత్రం పతకాలకోసం ఇతర రాష్ట్రాల క్రీడాకారులకు లక్షల రూపాయలు ఎర చూపిందన్నది సుస్పష్టం. దీంతో మన రాష్ట్ర ఖజానాపై పతకాలకే ఆరు కోట్ల రూపాయల భారం పడింది. ఈ అనవసరపు భారం తీర్చేదెవరో? ★

ఎం.ఆర్.అరుణకుమారి

స్పర్శ



"నా చిన్ని బొజ్జే నాకు శ్రీరామ్మరక్ష!" అన్నట్లు ఆబగా, ఆత్రంగా పాలు తాగుతున్న నేను ఉలిక్కిపడ్డాను. ఏంటిది? నాపైన ఎవరో... చుక్కలు... చుక్కలుగా... నీళ్ళు... ఓ... అమ్మ కారుస్తున్న కన్నీళ్ళు.... మొహమంతా తడితడిగా... చిరాగ్గా... పాలు తాగటం ఆపి పక్కకు తిప్పాను తల. తుడుచుకోలేను కదా! అమ్మో లేక అమ్మమ్మో తుడవాలి. కొందరికైతే నాన్నమ్మ...! మరి నాకు నాన్నమ్మ ఉందో... లేదో.. తెలీదు. అవును. అసలు.. నాన్నెవరో తెలీకుండా నాన్నమ్మ ఎలా తెలుస్తుంది, నా పిచ్చిగానీ? అసలింతకూ ఎవరో ఒకరు... అదిగో... అలా దూరంగా మొహం మటమటలాడిస్తూ కూర్చున్న నాయనమ్మ... అదే.. అమ్మవాళ్ళ నాయనమ్మయినా... నా మొహం మీద తడి తుడవచ్చు కదా! లేకపోతే నాకు చలిగా, చిరాగ్గా ఉంటుందని తెలీదా? తెలీకపోతే నేనైనా చెప్పాలి కదా!

నా చుట్టూ అందరూ మాట్లాడేది నాకు తెలుస్తోంది గాని, నేను మాట్లాడేదే అందరికీ అర్థమవటం లేదు అమ్మకు, అమ్మమ్మకు తప్ప! అమ్మకేం తెలీదని అమ్మమ్మ తిడ్తోంది గాని అమ్మలకు తమ బిడ్డల భాష తెలీదా? అంతెందుకు? ఎంతమందిలో ఉన్నా... కళ్ళకు గంతలు కట్టినా... అదీ పుట్టాక బిడ్డలతో కొద్ది గంటల సేపు మాత్రమే గడిపి ఉన్నా సరే... కేవలం స్పర్శ ద్వారానే తమ బిడ్డలను గుర్తించే శక్తి తల్లులకు, అలాగే తల్లి స్పర్శను బిడ్డలూ గుర్తిస్తారని, దీనికి కారణం... స్పర్శలోని ఆత్మీయతేనని ఇటీవల జెరూసలెంకు చెందిన శాస్త్రనిపుణులు తమ పరీక్షల ద్వారా నిరూపించారు కదా! అసలు... మనుషులు, జంతువులు, పక్షులు; కీటకాలు... సమస్త ప్రాణికోటి మధ్య అనురాగాన్ని, అనుబంధాన్ని సృష్టించింది ఈ 'స్పర్శే' కదా! స్పర్శ లేకుండా 'సృష్టే' లేదు కదా!

అమ్మ చేతుల్లో ఉన్న నేను అసహనంగా కదలటం.. పాలు తాగకపోవటం... అమ్మ వెంటనే గుర్తించి... గబగబా నా మొహం తుడిచింది పాత గుడ్డతో నేను చెప్పకపోయినా. ఆ గుడ్డతోనే తన కళ్ళు, చెంపలూ తుడుచుకొంది.

"ఇప్పుడేడ్చి ఏం లాభమే... ముదనష్టపు ముండా! ఈ ఏడుపేదో 'అప్పుడే' ఏడ్వక పోయినావా? నిండా మునిగే దాకా 'బెల్లం కొట్టిన రాయి'లా ఉండకపోతే కొంచెం ముందుగానన్నా ఏడ్చి నచ్చుంటే... ఇప్పుడీ ముండ పుట్టి సచ్చుండేది కాదు కదా?" నాయనమ్మ... అమ్మకు నాయనమ్మ... తిడ్తోంది అమ్మను. నాయనమ్మ తిట్లు నాకు, అమ్మకు కొత్త కాకపోయినా... బాధగా ఉంటుంది. నిజం చెప్పొద్దు! ఆరోజు నాకు ఎంత భయమేసిందో! నాయనమ్మ మాటలు విని నన్ను పొట్టలోనే చంపిస్తారేమోనని! ఎంతమంది అలా గుట్టు చప్పుడు కాకుండా 'శని' విరగడ చేసుకోవటం లేదు!

తమ బాధ్యత, ప్రమేయం ఏమీ లేకపోయినా... కనీస జాలి, దయ, మానవత్వం లేకుండా పసిడిమొగ్గలుగానే చిదిమివేయబడటం ఎంత నరక యాతనో... ఈ నరరూప రాక్షసులకేం తెలుసు ?

"నిజమే బంగారూ! నిన్ను... పుట్టకముందే... చంపేయాలంటే బాధగానే ఉంది. కానీ ఏం చెయ్యలేని దౌర్భాగ్యం, దురదృష్టం...! నా భవిష్యత్ కోసం... నీకు బతుకే లేకుండా చెయ్యటం అన్యాయమే! కాదనను. కానీ అసలు అన్యాయం నాకే జరిగింది. ఇహ నీకు నేనేం న్యాయం చెయ్యగలను చెప్పు! ప్లీజ్! కన్నా! నన్ను క్షమించవా?" ఆ రాత్రంతా అమ్మ ఏడుస్తూనే ఉంది.

"పోన్లేమ్మా! జబ్బు పడ్డ తనయుల ఆయుష్షు కోసం తండ్రులు ప్రాణత్యాగం చేశారని... చరిత్ర పాఠాలు.. నువ్వు పరధ్యానంగా ఉన్నా.. నేను శ్రద్ధగానే విన్నాన్లే క్లాసు రూంలో! ఇక్కడ రివర్స్! ముందు చూపులేని అమ్మల అమాయకత్వ కత్తికి బిడ్డల వంద వసంతాల బతుకు పద్మాలు బలవుతున్న సంప్రదాయం... ఈనాటిదా? కుంతికాలం నుండి వస్తున్నదే కదా! బాధపడకమ్మా!

కుంతి కన్నా... నువ్వే నయమనుకో! పుట్టాక.. ఏ మురిక్కాలువలోనో శవమై తేలే యాతన లేదు. ఏ ఆస్పత్రి మెట్లమీదో, ఏ రోడ్డు పక్కో, ఏ ముళ్ళపొదల మాటునో, ఏ దిబ్బలోనో, మరే మరుభూమిలోనో పారేస్తే.. అక్కున చేర్చుకొని ఆదరించే రాధలు, కణ్వులు, శకుంతలలు లేని... స్వార్థ పూరిత జనారణ్యంలోని జనం గుమికూడి నన్ను, నిన్ను... నానా మాటలతో అసహ్యించుకుంటుంటే భరించలేక... ఏ కుక్కలో, నక్కలో, కాకులో, గద్దలో... పీక్కు తినేదాకా... నీకోసం... ఏడ్చి... ఏడ్చి... ఓహ్! ఆ దుస్థితి నాకు కలగకుండా.... నీ కడుపులో నుండి భద్రంగా పెంటకుప్పకు చేరిపోతాను కదా! అందుకు నీకు నేనే థాంక్స్ చెప్పాలి. ఏడ్వకమ్మా! ఏడవకు! నువ్వేడిస్తే నాకూ ఏడుపొస్తుంది."

"ఏయమ్మ కన్నబిడ్డో ఎక్కెక్కి ఏడిస్తే... ఎవరెత్తుకు ఓదార్చేరన్నట్లుగా... దొంగముండకు ఏడుపుకేం తక్కువ లేదు. గుండ్రాయి మాదిరుంది. గట్టిపిండం. కడుపులోనూ సావలా! పుట్నాకా సావలా!" నాయనమ్మకు నన్ను చూస్తేనే ఒళ్లు మంట. "నాయనమ్మా!" అమ్మ గొంతులో కలిసిన బాధ, కోపం... కీచుగా!

"ఆఁ! మూని పెడ్తే పానిపోతుందన్నట్లుగా.. ఏం చెప్పకుండా.. మానం, పరువు.. తీసి... నలగర్లో తలెత్తకు తిరక్కుండా చేస్తివి? కోపం గదా నీ బతుక్కి? నెత్తి, నోరు కొట్టుకొని చెప్తి... సదువులు, సట్టుబండలూ వద్దు... సమర్తాడంగనే పెండ్లి చేసేద్దామని. అమ్మాకూతుండ్లు... యినకుండా... సదువో.. సదువో... అని ఎగిర్తిరే! ఇప్పుడేమాయ?" సందు దొరికిందే చాలని నాయనమ్మ... తిట్లు!

అమ్మ పావం... గుడ్ల నీరు తిప్పుకోవటం తప్ప ఏం చెయ్యగలదు? అమ్మమ్మ వస్తోంది ఎవర్తోనో గట్టిగా మాట్లాడుతూ! అమ్మమ్మ ఉంటే నాయనమ్మ నోరు తెరవదు. తిట్టదు. హమ్మయ్య.

"ఇంటికి, అమ్మానాన్నలకు, అయిన వాళ్ళందరికీ దూరంగా... హాస్టల్లో... ఉండే పిల్లలు.. ఎవరు ప్రేమగా మాట్లాడినా దగ్గరవుతారు. అదే అలుసుగా.. అభం శుభం తెలీని పసిబిడ్డల్ని... బిడ్డ తల్లుల్ని చేసెయ్యడమేనా? మంచీ, చెడ్డా నేర్పే గురువులు తండ్రితో సమానం కాదా? బిడ్డలాంటి దానితో.. వాడు.. మనిషా? మనిషి రూపంలో ఉన్న మృగమా? జంతువులే కదా.. వావి వరసా లేకుండా... ఛీ! ఛీ! పశువు కన్నా హీనమైన వాడ్ని కఠినంగా శిక్షించాలి!" అమ్మమ్మ... ఆవేశంలో ఆవేదన!

మా మంచం చుట్టూ... డాక్టర్లు, నర్సులు, పోలీసులు, విలేకర్లు, వీడియో, ఫొటోగ్రాఫర్లు... ప్రజాప్రతినిధులు, మహిళా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు....ఒహటే జనం... గందరగోళంగా..ఆరాలు, ఓదార్పులు... ధైర్యం చెప్పడాలు... నాకైతే ఊపిరాడ్డం లేదు. ఏ ప్రశ్నకూ జవాబు చెప్పకుండా తలదించుకొన్న అమ్మ కళ్ళల్లో నుండి వేడివేడి కన్నీటి చుక్కలు... నా మీద.. చిరాగ్గా... ఒకింత కోపంగా... ఆనందంగా కేరింతలు కొట్టే యోగం నాకు లేదేమో... అమ్మలా... నాకూ ఏడుపే ఎప్పుడూ శరణ్యమా? నిజ్జంగా ఏడుపొచ్చేసింది.నేనూ కేర్! కేర్ మనటం మొదలెట్టాను.. అమ్మమ్మ అమ్మ చేతుల్లోనుండి నన్ను తీసుకొంది.

"చూడండయ్యా ఈ పసిగుడ్డును! చూడండమ్మా ఈ ముక్కు పచ్చలారని బిడ్డను! నిండా పద్నాలుగేళ్ళు లేవు. తొమ్మిదో తరగతి చదివే బిడ్డకేం తెలుసని ఈ దారుణం చేశాడా వెధవ? ఆడపిల్లలంతా చదువుకోవాలని, ఉచితంగా చదువులు, హాస్టళ్ళు ఏర్పాటు చేశామంటారు. నిజమే! కానీ అక్కడ ఆడపిల్లలకు భద్రత లేకుండా పోయిందే! కంచే చేను మేస్తే ఎట్లా? తిండి సరిగా పెట్టక కడుపు మాడ్చినా పరవాలేదు గాని... ఇట్లా కడుపులు చేసి బిడ్డల బతుకులు నాశనం చేస్తావుంటే... ఏ ఆడపిల్ల చదవాలనుకుంటుంది? ఏ తల్లిదండ్రులు చదివించాలనుకొంటారు? చదువుకుంటే ధైర్యం వస్తాదంటారు కానీ చదువుకోడానికే సాహసం చేయాల్సిన పరిస్థితులుంటే ఎట్లా? చెప్పండి. మీరే చెప్పండి న్యాయం?" అమ్మమ్మ అపర చండికలా ప్రశ్నల అగ్నివర్షం కురిపిస్తోంది.

"ఆ టీచరును అరెస్ట్ చేశారు. మేమతనితో మాట్లాడాం. అతనసలు తనకేం తెలీదంటున్నాడు. మీ పాప కాస్త దిగులుగా ఉండేదని... హోం సిక్‌నెస్‌తో చదువును అశ్రద్ధ చేయకుండా... కాస్త చనువుగా వుండేవాడని, తెలీని పాఠాలు చెప్పించేవాడని... అంతకుమించి తనే పాపమూ చెయ్యలేదని అన్నాడు."

"అయ్యోపావం! ఏ పావమూ చెయ్యకపోతే ఈ పాప ఎట్లా పుట్టిందయ్యా! వాడెంత బొంకినా రంకు దాగుతుందా? తెలీని పాఠాలు చెప్తుంటే సమస్యేముంది? చెప్పరాని పనులు చేసేని... ముంగిలా... నాకేం తెలీదంటే మాత్రం... మిగతా టీచర్లు, పిల్లలు, పనివాళ్ళు... ఇదో... ఈ బిడ్డా... వాడ్ని ప్రమాణం చెయ్యమనండి చూద్దాం!"

"ఆ పొద్దు సదువొద్దంటే ఇన్లేదు. పెద్ద పానం పోయినా ఉన్నా... కడుపు పోగొట్టమంటే ఆ డాక్టరమ్మ ఇన్లేదు. పుట్టగానే ఏడన్నా పారేయమంటే ఇన్లేదు. ఇంగా ఏం పరువుందని పేపర్లకు, టీవీలకు ఎక్కతాండారు. అమ్మాకూతుండ్లు?" నాయనమ్మ కోపంతో రగులుతోంది.

"అదేమవ్వా! ఇంత అన్యాయం జరిగితే అది ప్రపంచానికి తెలవద్దా? తప్పు చేసిన వాడికి శిక్ష పడవద్దా?"

"సిచ్చ ఎవురికి నాయనా పడేది? ఆడబిడ్డ బతుకు అరిటాకే కదా! ఎట్లా ముల్లు తగిల్నా నాశనమయ్యేది ఆడబిడ్డే కదా!"

"అతనికి తప్పకుండా శిక్ష పడుతుంది. ఇంకో ఆడపిల్లకు అన్యాయం జరక్కుండా చేసిన వాళ్ళమవుతాం కదా!"

"మా బతుకులు మాత్రం బజారుపాలు చేస్తారు కదా!'

"లేదులేవ్వా! మీ పేర్లు రాయం. మొహాలు గుర్తుపట్టకుండా వేస్తాం! ఎవరికీ తెలీదులే!"

"తప్పు చేసిన వాళ్ళెపుడూ దర్జాగా తలెత్తుకు తిరుగుతూనే ఉంటారు. ఏ తప్పూ చేయకపోయినా జీవితాంతమూ శిక్ష అనుభవించేది ఈ బిడ్డలిద్దరునే కదా!" నన్ను, అమ్మను చూపుతూ అమ్మమ్మ కళ్ళనీళ్ళ పర్యంతమై... అంతలోనే తేరుకుంది.

"ఏమైనా సరే! ఉచ్ఛనీచాలు లేని ఆ పశువుకు కఠిన శిక్ష పడాల్సిందే! నిజంగా వాడ్ని ఉరితీస్తే బాగుండు. వాడికి మగతనం లేకుండా చేసి వాడూ జీవితాంతమూ కుమిలేలా చేస్తే ఇంకా బాగుండు. ఇలాంటి తప్పులు... ఎవరూ చేయకుండా.. ఇలాంటి శిక్షలు వేసే... చట్టాలు... రావాలి!"

"అవును.. అప్పుడు గానీ గాంధీజీ కలలు గన్న... ఆడపిల్లలు నిర్భయంగా పగలు, రాత్రుళ్ళూ.... తిరగ్గలిగే నిజమైన స్వాతంత్ర్యం మనకు రాదు. మీరేం భయపడకండి. బాధపడకుండా ఉండలేరు. కానీ మీ వెనుక మేమంతా ఉన్నాం. న్యాయం జరిగేదాకా... కలసి పోరాడుదాం!"

గోల గోలగా ఉన్న వాతావరణం సద్దుమణిగి... ప్రశాంతమవడానికి చాలాసేపు పట్టింది. గొంతు, గుండె... చించుకున్నట్లుగా... అరచి... అరచి... అలసిన అమ్మమ్మ కింద నేల మీదే పడుకొని నిదురబోయింది. అంతమందిల అనీజీగా... సతమతమైన నేను... బొజ్జనిండా పాలుతాగి, అమ్మ ఒడిలోనే వెచ్చగా... గాఢనిద్రలోకి చేరుకోబోతున్న వేళ.. అమ్మ మునివేళ్ళు సుతారంగా నా బుగ్గలు నిమిరాయి. అమ్మ చల్లని పెదవుల స్పర్శ నా నుదిటి మీద... అమ్మగుండె చప్పుడు నా చెవుల్లో... మంద్రంగా... విపరీతమైన వేదన... సంవేదిస్తున్నట్లు.. ఆర్తిగా.. ఆర్ద్రంగా... "బయటే కాదు... గుడిలాంటి బడి, స్వర్గం లాంటి ఇల్లు.. ఎక్కడా... ఆడపిల్లకు భద్రత లేదు."

దసరా సెలవులకు ఇంటికెళ్ళినపుడు... అమ్మమ్మకు సీరియస్‌గా ఉందని అమ్మ ఊరికెళ్ళినప్పుడు.. రాత్రిళ్ళు... నాన్న కౌగిలిలో... పురుష స్పర్శ.... నా బంగారూ! నీకు నాన్న ఎవరని చెప్పను? నాన్నా?!? సారా?!?"

అదిరిపడి లేచాను. అమ్మ స్పర్శ కూడా శత్రుస్పర్శలా... నా పుట్టుక నాకే అసహ్యంగా... అనాగరికంగా.. అసభ్యంగా... గుండెలు పగిలేలా ఏడ్వడం మొదలెట్టాను.

★

చట్టాలను సులువుగా వివరించే కథలు

ఉన్నత చదువులు అభ్యసించిన వారికి సైతం మన చట్టాలు ఒక పట్టాన అర్థం కావు. ఏదైనా సమస్యపై కేసు ఏవిధంగా పెట్టాలి, కోర్టు విధివిధానాలు ఎటా ఉంటాయి, లాయర్ల పాత్ర ఎంత అనే అంశాలపై ప్రత్యక్ష అనుభవం ఉన్నవారికి తప్ప చాలా మందికి అవగాహన లేదనడం అతిశయోక్తి కాదు. అందులోనూ సామాన్యులకు కోర్టు వ్యవహారాలు ఒక పద్మ వ్యూహమే. చట్టాలపై, కోర్టు విధివిధానాలపై అవగాహన లోపంతో లాయర్లు, పోలీసుల చేతిలో మోసపోతున్న వారు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది 'అదాలత్ కథలు' పుస్తకం. వరంగల్ జిల్లా కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న కట్రా ఎల్లారెడ్డి తన 15 ఏళ్ల న్యాయవాద వృత్తిలోని అనుభవాలను క్రోడీకరించి ఈ పుస్తకాన్ని రాసారు. ఇందులో వివిధ రకాల 30 కేసులకు సంబంధించిన కథలు ఉన్నాయి. వీటిని కథలు అన్నప్పటికీ అన్నీ కోర్టులో నడిచిన కేసులే. న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా రచయిత జాగ్రత్తలు తీసుకున్నారు. కోర్టుల్లో సంవత్సరాల తరబడి సాగిన కేసులను, ఎన్నో చిక్కుముడులతో వాదప్రతివాదనలు జరిగిన కేసులను సరళ భాషలో సామాన్యుడికి సైతం అర్థమయ్యే రీతిలో రాయడంలో రచయిత సఫలీకృతులయ్యారు. సామాన్య ప్రజానీకం నిత్యం ఎదుర్కొనే ఎన్నో సమస్యలకు కోర్టు ద్వారా ఎటువంటి పరిష్కారం వస్తుందనేది ఈ కథల ద్వారా అర్థం చేసుకోవచ్చు. రచయిత కూడా అటువంటి కేసులనే ఎక్కువగా ఎంచుకొని రాశారు. చాలా అంశాలపై సామాన్యులు సైతం సులువుగా న్యాయ విజ్ఞానాన్ని తెలుసుకోవచ్చు. వివిధ రకాల కేసులను కథలుగా ఇవ్వడంతో విజ్ఞానమే కాక చదవడానికి ఆసక్తిదాయకంగా కూడా ఉన్నాయి. కల్తీ విత్తనాల వల్ల కల్గిన నష్టాన్ని రైతు ఎలా రాబట్టవచ్చు, రెండో భార్య సంతానానికి ఎటువంటి హక్కులు ఉంటాయి, ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన రోజువారీ కూలీలకు ఏవిధమైన నష్టపరిహారం వస్తుంది, డాక్టర్ల నిర్లక్ష్యానికి ఎటువంటి పరిహారం పొందవచ్చు అనే అంశాలకు సంబంధించిన న్యాయ విజ్ఞానం ఈ కథలలో ఉంది. వివాహ బంధానికి సంబంధించి ఏడు కథలు ఉన్నాయి. లోక్ అదాలత్‌ల పనితీరుపై పూర్తి అవగాహన కల్గుతుంది. అలాగే పోలీసులతో వచ్చే సమస్యలను ఎలా ఎదుర్కోవాలనే విజ్ఞానాన్ని లాకప్‌డెత్, అక్రమ నిర్బంధం, ఖైదీహక్కు కథల ద్వారా వివరించారు. కొన్ని కథలను చదివితే పాఠకులకు ఒళ్లు జలదరిస్తుంది. జడ్జీలు తీర్పులు అమ్ముకున్న తీరును అమ్మకానికి తీర్పులు, లాయర్ల మోసాన్ని అవినీతి లయ్యర్, దొంగ సాక్ష్యాల తీరును అంతా నిజమే చెప్తాను అనే కథలో వివరించారు. మన న్యాయవ్యవస్థలోని లోపాలను ఈ కథలు ఎత్తి చూపుతున్నాయి. సంక్లిష్టమైన న్యాయ అంశాలను సులువుగా అర్థమయ్యేట్లు కథల ద్వారా చేసిన ఈ వినూత్న ప్రయోగం సామాన్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే కథలలో ఎక్కువ భాగం వివాహ బంధం, ప్రమాదాల గురించే ఉన్నాయి. క్రిమినల్ కేసుల కథలు చాలా తక్కువగా ఉన్నాయి. కార్మిక హక్కులకు సంబంధించి కూడా ఒక కథ మాత్రమే ఉంది. రైతుల సమస్యలకు సంబంధించిన విజ్ఞానాన్ని తెలిపే కేసులు తక్కువగా ఉన్నాయి. ఇటీవల కాలంలో ప్రజలకు పోలీసుల నుండే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి. రాజ్యం వ్యక్తులపై చేసే హింస కూడా పెరుగుతున్నది. ఈ సమస్యలకు న్యాయపరంగా ఎటువంటి పరిష్కారం ఉంటుందని ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు. రాబోయే ప్రచురణలలో రచయిత ఈ విజ్ఞానాన్ని అందిస్తారని ఆశిద్దాం. ఆసక్తిని కల్గించే విధంగా కథలు ఉండడానికి రచయిత ప్రయత్నించారు. అయితే కొన్ని కథల్లో మొదట్లో చెప్పిన విషయాలే మరలా పునరావృతమయ్యాయి. ఆసక్తిగా సాగుతున్న కథనంలో ఇది కొంత ఇబ్బందిని కల్గించింది.

అదాలత్ కథలు
రచన : కట్రా ఎల్లారెడ్డి,
వెల : రూ. 40/-, **ప్రతులకు :** కె.ఎల్లారెడ్డి, 1-7-821, శాంతినగర్, హన్మకొండ, వరంగల్-506001.

- గమిడి శ్రీనివాస్

స్వీకారం

చిత్రకారులు చిత్రాలను అందించినట్లుగానే రచయితలు ఎన్నో జీవిత చిత్రాలను తమ కథల ద్వారా అందిస్తారు. ఆ కథలలో నవరసాలు మనకు కనిపిస్తాయి. విజేత దినపత్రిక కథా కిరణాలు శీర్షికన అందించిన 122 మంది కథకుల జీవిత చిత్రాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు.

కథా కిరణాలు
మన తెలుగు కథకులు
రచన : పైడిమర్రి రామకృష్ణ; **వెల:**రూ. 50/-; **ప్రతులకు :** పి. హేమలత, 10-3-211, మామిళ్ళగూడెం, ఖమ్మం; విశాలాంధ్ర బుక్‌హౌస్, దిశపుస్తక కేంద్రం, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్



నామ విజ్ఞానం అనే అంశాన్ని ఒక శాస్త్రంగా ఈ రచయిత వెలుగులోకి తెచ్చారు. దీనిని ఒక శాస్త్రంగా అభ్యసించడంగాని, బోధించడం గాని ఆంధ్రదేశంలో అందునా నాగార్జునా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో తప్ప ప్రపంచంలో ఎక్కడా జరగలేదు.

నామవిజ్ఞానం
రచన : ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు; **వెల:**రూ. 130/-; **ప్రతులకు :** ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరావు, 13-8/1, నిర్మలా సదన్, కృష్ణనగర్ విజయవాడ.

ఇందులో వివిధ కులవృత్తుల వారు పడుతున్న ఇబ్బందులను కళ్ళకు కట్టినట్లుగా కవితల రూపంలో అందించారు రచయిత.

ముల్లుగర్ర
రచన : రాంరెడ్డి; **వెల:**రూ. 20/-; **ప్రతులకు :** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, దిశపుస్తక కేంద్రం, హైదరాబాద్